

వర్క్‌షాపులో పాల్గొన్న ఎమ్మెల్యేలు, కలెక్టర్లు



రైతుభరోసా వర్క్‌షాపులో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, పక్కన మంత్రులు తుమ్మల, పొంగులేటి, సీతక్క

### రైతుల జాబితాపై రగడ..

వ్యవసాయ శాఖాధికారులు సిద్ధం చేసిన రైతుల జాబితాపై పలువురు ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ పార్టీలో కీలకంగా వ్యవహరిస్తున్న వారికే మాట్లాడే అవకాశం ఇవ్వడం ఏమిటన్న ప్రశ్నలు వినిపించాయి. అసలైన రైతులకు కాకుండా నేతలకు అవకాశం ఇస్తే ప్రయోజనం ఉండదనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఒకరిద్దరు రైతులు మాట్లాడిన తర్వాత కొంతమంది రైతులు ఆందోళన చేసే ప్రయత్నం చేశారు. తమకు అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే వెడ్మబొజ్జు తాము రైతుల జాబితాను తయారు చేయలేదని, వ్యవసాయ శాఖాధికారులే సిద్ధం చేశారంటూ సమాధానం ఇచ్చారు. అందరికీ అవకాశం ఇస్తామని నచ్చచెప్పడంతో శాంతించారు.

### కొందరికే అనుమతి..

రైతుభరోసా పథకం అమలు విధివిధానాల ఖరారుపై రైతు అభిప్రాయసేకరణ కోసం ఉట్నూర్‌కు వచ్చిన మంత్రివర్గ ఉపసంఘం సమావేశానికి అధికారు లు కొందరికే అవకాశం ఇవ్వడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. బహిరంగ ప్రదేశంలో కాకుండా సమావేశమందిరంలో వర్క్‌షాపును నిర్వహించ డం సరైంది కాదంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. సమావేశ మందిరం 200 మందికే పరిమితం కావడంతో వందలాది మంది బయటనే వేచి చూడాల్సి వచ్చింది. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి ఎంతో ఆసక్తిగా తరలివచ్చిన రైతులకు అవకాశం దక్కక పోవడంతో నిరాశగా వెనుదిరిగి పోయారు. దీంతో అధికారుల ఏర్పాట్లపై సర్వత్రా విమర్శలు వచ్చాయి. కొద్దిసేపు మీడియా ప్రతినిధులను కూడా పోలీసులు లోపనికి అనుమతించక పోవడం గందరగోళ పరిస్థితులకు దారితీసింది.



సమస్యలపై వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యేలు

# రైతు చెప్పిందే చేస్తాం

» ఉట్నూర్ రైతుభరోసా వర్క్‌షాపులో ఉపముఖ్యమంత్రి భట్టి, మంత్రులు » రైతుల అభిప్రాయాలను సేకరించిన మంత్రివర్గ ఉప సంఘం
» 10 ఎకరాలకే పరిమితం చేయాలని మెజార్టీ రైతుల అభిప్రాయం » ఏజెన్సీలో రైతు భరోసా పథకానికి పరిమితులు వద్దంటూ పలువురి సూచన
» త్వరలో సీఎం ఉమ్మడి జిల్లా పర్యటన ఖరారు » వ్యవసాయ శాఖ అధికారుల తీరు పై మండిపాటు » ఏర్పాట్లు సరిగా లేక వెళ్లిపోయిన రైతులు



అధికారుల తీరును తప్పుబడుతున్న రైతులు



వర్క్‌షాపులో పాల్గొన్న ఉమ్మడి జిల్లా రైతులు

ఆదిలాబాద్, జూలై11 (ఆంధ్రజ్యోతి)/ఉట్నూర్: రైతు భరోసాను రైతులు చెప్పినట్టే ప్రభుత్వం అమలు చేస్తుందని మంత్రివర్గ ఉపసంఘం పేర్కొంది. గురువారం ఉట్నూర్ మండలకేంద్రంలోని కేబీ కాంప్లెక్స్ సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన రైతుభరోసా వర్క్‌షాప్‌లో పాల్గొన్న మంత్రివర్గ ఉపసంఘం పలువురు రైతుల నుంచి అభిప్రాయాలను సేకరించింది. ప్రత్యేక హెలిక్యాప్టర్‌లో ఉట్నూర్‌కు చేరుకున్న మంత్రుల బృందానికి ఎమ్మెల్యేలు వెడ్మబొజ్జు, ప్రేమ్‌సాగర్‌రావు, జిల్లా కలెక్టర్ రాజార్షిషా, ఐటీడీఏ పీఓ ఖుష్బుగుప్తా, నిర్మల్ ఎస్పీ ఘన స్వాగతం పలికారు. అనంతరం రైతుఅభిప్రాయ సేకరణలో పాల్గొన్న ఉపముఖ్యమంత్రి సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడారు. పంటలసాగుకు అందించే పెట్టుబడి సహాయాన్ని అసలైన రైతులకు అందే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. పేద, బడుగుబలహీన వర్గాలకు న్యాయం జరిగేలా ప్రభుత్వ నిర్ణయం ఉంటుందని పేర్కొన్నారు. రైతుభరోసా సహాయంపై ఇప్పటివరకు ఎలాంటి పరిమితులు విధించలేదని తెలిపారు. పోడు రైతులకు ప్రభుత్వ సహాయంపై చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలనంటిని ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలుచేస్తుందన్నారు. ఆ తర్వాత రాష్ట్రవ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ చిన్నసన్నకారు రైతులకు సక్రమంగా పెట్టుబడి సహాయాన్ని అందించేందుకు ప్రభుత్వం అన్నిరకాల ప్రయత్నాలు చేస్తుందన్నారు. గతంలో అనర్హులకు రైతుబంధు దక్కింది. ఇకపై అలాంటి పరిస్థితులు ఉండదన్నారు. ఏదైనానిరుపేదలకు ప్రభుత్వ సహాయం అందాలన్నదే తమ ప్రభుత్వ ప్రధాన ఉద్దేశ్యమన్నారు. అనంతరం రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో నాలుగు గోడల మధ్యే నిర్ణయాలు తీసుకోవడంతో ప్రజావ్యతిరేకత వచ్చిందన్నారు. అందుకే రైతుల సలహాలు, సూచనల మేరకే ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని, ప్రతీపైసా ప్రజల సొమ్ము అని న్యాయబద్ధంగాపేదలకు అందాలన్నదే సీఎం రేవంత్‌రెడ్డి ఉద్దేశ్యమన్నారు. గతంలో రోడ్లు, గుట్టలు, ఫాంహౌజ్‌లకుకూడా రైతుబంధే సొమ్ము అందిందని ఇప్పుడు అలా ఉండదన్నారు. జిల్లాఇన్‌చార్జీ మంత్రి సీతక్క మాట్లాడుతూ గతంలో కోట్ల విలువ చేసే కారులో వచ్చి రైతుబంధు సొమ్మును తీసుకోవడం ఎంతవరకు సమంజసమన్నారు. ఏజెన్సీలో రైతులకు పట్టాలు ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ హయాంలో పహాణీలతో పథకాలు అందాయని, నేడు ఆ పరిస్థితి లేదన్నారు. వ్యవసాయం చేసినోడికే పెట్టుబడి సహాయం అందేలా చర్యలు తీసుకుం టామన్నారు. అయితే ఎమ్మెల్యేలు పలువురు రైతులు మాట్లాడుతుండగా సమస్యకు పరిష్కారం మీరే చూపాలంటూ మంత్రులు పలుమార్లు కోరారు. మొత్తానికి రైతుభరోసాపై నిర్వహించిన వర్క్ షాపు ప్రశాంతంగానే ముగిసింది. కార్యక్రమంలో శాసనసభ్యులు ప్రేమ్‌సాగర్‌రావు, గడ్డంవివేక్, వెడ్మబొజ్జు, కోవ లక్ష్మి, అనిల్ జాదవ్, పాయల శంకర్, ఎంపీలు గోడం నగేష్, వంశీకృష్ణ, ఎమ్మెల్సీ దండె విఠల్, ఆయా జిల్లాల కలెక్ట ర్లు, ఐటీడీఏ పీఓ, నిర్మల్ ఎస్పీ, డీసీసీబీ చైర్మన్ అడ్డిబోజారెడ్డి, మాజీ జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు గిమ్మా సంతోష్, డేరాకృష్ణారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

### త్వరలో జిల్లాకు సీఎం : సీతక్క



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులపై ప్రభుత్వం ప్రత్యేకదృష్టిని సారించిందని జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క పేర్కొన్నారు. ఇందులో భాగంగానే సీఎం రేవంత్‌రెడ్డి త్వరలోనే జిల్లాకు రానున్నారని మంత్రి తెలిపారు. ప్రాజెక్టుల నిర్మాణం, అభివృద్ధిపనులపై చర్చించే అవకాశం ఉందన్నారు. దీనికి కలెక్టర్లు పూర్తి నివేదికలతో సిద్ధంగా ఉండాలన్నారు. త్వరలోనే ముఖ్యమంత్రి పర్యటన షెడ్యూల్ ఖరారయ్యే అవకాశం ఉందని తెలిపారు.

### నాలుగైదు లక్షలకు ఎకరం కొనివ్వకుంటే రాజీనామా చేస్తా.. : బోథ్ ఎమ్మెల్యే

రైతుభరోసా పథకం అమలు వర్క్‌షాపులో పాల్గొన్న బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ మాట్లాడుతూ.. ఇతర జిల్లాలతో పోల్చుకుంటే తమ జిల్లాలో భూముల ధరలు అతి తక్కువగా ఉంటాయని, కేవలం రూ.2లక్షలకే ఎకరం దొరుకుతుందని అన్నారు. ఇదేఎకరం ఇతర జిల్లాలో కోటికి పైగా ఉంటుందని చెప్పడంతో వెంటనే వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు కల్పించుకుని రూ.2లక్షల చొప్పున వెయ్యి ఎకరాలు ప్రభుత్వానికి ఇప్పిస్తావా అని ప్రశ్నించారు. దీంతో జిల్లాలో నాలుగైదు లక్షలకే ఎన్ని ఎకరాలైనా ప్రభుత్వానికి ఇప్పిస్తానని, లేదంటే తన పదవికి రాజీనామా చేస్తానంటూ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అనడంతో అందరూ ఆశ్చర్యానికి గురయ్యారు.

### నాలుగు గోడల మధ్య నిర్ణయాలుండవ్



● పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి (రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి)

ఇందిరమ్మ రాజ్యంలో నాలుగు గోడల మధ్య ప్రభుత్వ నిర్ణయాలు ఉండవని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గత ప్రభుత్వం నాలుగు గోడల మధ్యనే నిర్ణయాలు తీసుకోవడంతో ప్రజా వ్యతిరేకత వచ్చిందన్నారు. అందుకే రైతుల సలహాలు, సూచనల మేరకే ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని, ప్రతిపైసా ప్రజల సొమ్ము అని న్యాయబద్ధంగా పేదలకు అందాలన్నదే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉద్దేశ్యమన్నారు.

### రైతుభరోసాను పది ఎకరాలకే పరిమితం చేయాలి



● శ్రీకాంత్‌రెడ్డి (మావల మండలం)

ప్రభుత్వం అందించే పెట్టుబడి సహాయాన్ని పదిఎకరాలకే పరిమితం చేయాలి. గతంలో తీసుకొచ్చిన కౌలు చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి. అవసరమైతే దానిని సవరణ చేయాలి. పండించిన పంటలన్నింటికి మద్దతు ధరను కల్పించాలి. అన్ని పంటలకు బోనస్ ఇస్తేనే రైతులందరికి న్యాయం జరుగుతుంది. వందల ఎకరాలు ఉన్న రైతులకు పెట్టుబడి సహాయాన్ని ఇస్తే ప్రయోజనం ఉండదు.

### పది ఎకరాలకే పరిమితం చేయాలి

రైతుభరోసా పథకం అమలు, విధివిధానాలపై అభిప్రాయ సేకరణను చేపట్టిన మంత్రివర్గ ఉపసంఘం ముందు పలువురు రైతులు 10 ఎకరాలకే రైతు భరోసా పథకం కిందపెట్టుబడి సహాయాన్ని అందించాలని అభిప్రాయపడ్డారు. ఎన్నిఎకరాలు ఉన్నా పది ఎకరాలకు పరిమితం చేస్తే చిన్న సన్నకారు రైతులందరికీ సహాయం అందుతుందన్నారు. ముఖ్యంగారోడ్లు, గుట్టలు, వెంచర్లు, వ్యవసాయేతర భూములకు రైతుభరోసా ఇవ్వవద్దని సూచించారు. అయితేసీజన్‌కు ముందే పెట్టుబడి సహాయాన్ని అందిస్తే రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని పలువురు అభిప్రాయపడ్డారు. కౌలురైతుల చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. సాగుకు అనుకూలంగా లేని భూములకు పెట్టుబడి సహాయాన్ని ఇవ్వకుండా సాగు చేస్తున్న రైతులకు మాత్రమే సహాయాన్ని అందించాలన్నారు. కౌలు రైతులకు పెట్టుబడి సహాయాన్ని అందించి భూ యజమానులకు భరోసా కల్పించాలని రైతులు కోరారు.

### ఏజెన్సీ రైతులకు మినహాయింపు ఇవ్వాలి

రైతు భరోసా పథకం అమలులో విధించే గరిష్ఠ పరిమితిని ఏజెన్సీ రైతులకు మినహాయింపు ఇవ్వాలని పలువురు రైతులు కోరారు. ఏజె న్సీలో భిన్నమైన పరిస్థితులు ఉంటాయని పేర్కొన్నారు. అధికవర్షం పడితే పంటలు పండవని వర్షం కురవకుంటే పంటలు ఎండిపోయే ప్రమాదం ఉంటుందని మంత్రివర్గ ఉప సంఘం దృష్టికి తీసుకెళ్లారు. ఏజెన్సీలో గిరిజనేతరులకు భూపట్టాలు లేక పోవడంతో ఎలాంటి ప్ర భుత్వ పథకాలు అందడం లేదన్నారు. ఏజెన్సీలో ఎన్ని ఎకరాలు ఉన్న రైతుభరోసాను కల్పించాలన్నారు. ఆదివాసీ గిరిజన రైతుల ఆర్థిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం వెసులుబాటును కల్పించాలన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో చాలా సమస్యలున్నాయని ఇప్పటికీ పోడు రైతులపై అధికారుల దాడులు జరుగుతూనే ఉన్నాయని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న తుమ్మల నాగేశ్వర్‌రావు

## ఇకపై అనర్హులనే మాట ఉండొద్దు

● రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే రైతుభరోసా పథకంలో ఇకపై అనర్హులనే మాట ఉండవద్దంటూ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. చిన్న సన్నకారు రైతులకు సక్రమంగా పెట్టుబడి సహాయాన్ని అందించేందుకు ప్రభుత్వం అన్ని రకాల ప్రయత్నాలు చేస్తుందన్నారు. గతంలో అనర్హులకు రైతుబంధు దక్కింది. ఇకపై అలాంటి పరిస్థితులు ఉండదన్నారు. ఏదైనా నిరుపేదలకు ప్రభుత్వసాయం అందాలన్నదే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశ్యమన్నారు. నిజమైన రైతులకు పెట్టుబడిసాయం అందేలా సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. అన్నివర్గాల నుంచి అభిప్రాయాలను స్వీకరిస్తున్నామని, అందరి అభిప్రాయాల మేరకే ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు.

### విద్యార్థుల హాజరు శాతం పెంచండి

● రీజినల్ జాయింట్ డైరెక్టర్ సత్యనారాయణ

నేరడిగొండ, జూలై 11: విద్యార్థుల సంఖ్యతో పాటు హాజరుశాతాన్ని పెంచాలని రీజనల్ డైరెక్టర్ సత్యనారాయణ అన్నారు. గురువారం మండలంలోని తేజాపూర్ గ్రామంలో గల ఎంపీపీఎస్, జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలతోపాటు బుగ్గారాం(బీ) గ్రామాల్లో గల మండల ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలో గల విద్యార్థులను పలు ప్రశ్నలను అడిగివివరాలు సేకరించారు. మధ్యాహ్నభోజన కార్మికులతో మాట్లాడి నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందజేయాలన్నారు. విద్యార్థుల హాజరుశాతంతో పాటు పలు రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఆయ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉన్నారు.

### మతిస్థిమితం లేని వ్యక్తి మృతి

నేరడిగొండ, జూలై11: మండలంలోని మాధాపూర్‌కు చెందిన కుమ్రం సురేందర్ (56) మృతిచెందాడు. కుమ్రం సురేందర్ గురువారం వ్యవసాయపంట క్షేత్రంలో మృతిచెందిఉండగా స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు తెలుపగా సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతుడు కొంతకాలంగా మతిస్థిమితం లేక తిరిగేవాడని, గురువారం తెల్లవారుజామున తన వ్యవసాయ క్షేత్రానికి వెళ్తానని చెప్పి తిరిగి ఇంటికి రాలేదని కుటుంబీకులు తెలిపారు. మృతుడికి ఇద్దరు భార్యలు, ఐదుగురు సంతానం ఉన్నారు.

### విద్యుత్‌షాక్‌తో ఒకరికి గాయాలు

బోథ్, జూలై11: మండలంలోని కింది బాబర గ్రామంలో గురువారం ఉదయం 9 గంటల ప్రాంతంలో అదే గ్రామానికి చెందిన మేటీవార్ పరమేష్ అనే యువకుడు విద్యుత్ బల్బును అమర్చేందుకు డీటీఆర్ ఆఫ్ చేసి స్తంభంపై ఎక్కగా బల్బు బిగిస్తున్న సమయంలో విద్యుత్ షాక్ తగిలి కింద పడ్డాడు. వెంటనే బోథ్ ఆసుపత్రికి తరలించి అక్కడ నుంచి ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. తమకు సమాచారం లేకుండా విద్యుత్ స్తంభం ఎక్కవద్దని విద్యుత్ శాఖ ఏఈ రామకృష్ణ తెలిపారు.

### నూతన కార్యవర్గం ఎన్నిక

సిరికొండ, జూలై11: బోథ్ నియోజకవర్గ పాస్టర్ల సంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం మండల కేంద్రంలోని మోరియా చర్చిలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా సదానందం, అధ్యక్షులు యస్. నెహెమ్య, ఉపాధ్యక్షులు రెవ.డి.నరేష్ జెకర్యా, ప్రధాన కార్యదర్శి రెవ.యస్.మాణిక్యం, తదితరులు ఎన్నికయ్యారు.

## పథకం అమలుకు ప్రజాప్రతినిధుల సూచనలు, సలహాలు..









ఉట్నూర్ మండలకేంద్రంలోని కేబీ కాంప్లెక్స్ సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన రైతుభరోసా వర్క్‌షాప్ నిర్వహించారు. ఇందులో పాల్గొన్న మంత్రివర్గ ఉపసంఘంపలువురు రైతుల నుంచి అభిప్రాయాలను సేకరించింది. అలాగే ప్రజాప్రతినిధులు సైతం పలు సూచనలు, సలహాలు చేశారు. - ఉట్నూర్

#### రైతుభరోసా త్వరితగతంగా అమలు చేయాలి

● పాయలశంకర్ ( ఆదిలాబాద్ ఎమ్మెల్యే )

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని రైతుల మేలు కోసం చేపట్టిన రైతు భరోసా పథకాన్ని త్వరగా అమలుచేయాలి. రైతులకు ప్రయోజనం కలిగేలా ఫసల్‌బీమాపై దృష్టిపెట్టాలి. రైతుల ప్రీమియం ప్రభుత్వమే చెల్లించాలి. పారిశ్రామికవేత్తలకు సబ్సిడీలతో కోతలు పెట్టాలని, రైతుల కోసం ఉదారత చూపెట్టాలని సూచించారు.

#### భూములకు అనుగుణంగా రైతు భరోసా

● గోడం నగేష్, ఎంపీ ఆదిలాబాద్

ఏజెన్సీ ప్రాంతాల రైతుల భూముల పరిస్థితి తెలుసుకొని రైతుభరోసా పథకం అమలు చేయాలి. ఏజెన్సీ ప్రాంతాలలో గిరిజనేతర్ల భూమి సమస్యలు కూడా పరిష్కరించాలి.

#### ఇందిరమ్మ రాజ్యం దిశగా ప్రభుత్వం కృషి

● గడ్డం వంశీ (ఎంపీ, పెద్దపల్లి)

సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇందిరమ్మ రాజ్యం దిశగా రైతుల కష్టాలు తెలుసుకోవడానికి రైతు భరోసా కార్యక్రమాన్ని చేపట్టడం సంతోషంగా ఉంది. ధరణి పోర్టల్‌తో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని మార్పులు చేసే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోంది.

#### ఉమ్మడి జిల్లాలో 40శాతం కౌలు రైతులు

● కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు (ఎమ్మెల్యే, మంచిర్యాల)

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 40శాతం మంది కౌలురైతులు ఉన్నారు. కౌలురైతుల ప్రయోజనాలను కాపాడాల్సిన అవసరం ఉంది. గత ప్రభుత్వం రైతుబంధు పథకం ద్వారా 72వేల కోట్లు కేటాయించిందని, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 24వేల కోట్లు కేటాయించగా గుట్టలకు, వృథా భూములు ఉన్న వారికి రైతుబంధు అమలు చేయడం ద్వారా కౌలు రైతులకు మేలు జరగలేదు. రైతుభరోసా పథకం అమలు కోసం పట్టాదారులను, కౌలు రైతులను సమన్వయం చేయాల్సిన అవసరం ఉంది. రైతాంగానికి భద్రత కల్పించి ఇన్సూరెన్స్ పథకం అమలు చేయాలి. ఉమ్మడి జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాలలో గిరిజనులు, గిరిజనేతరుల సమస్యలు ఉన్నాయని వాటిని పరిష్కరించాలి. ఉమ్మడి జిల్లాలో అటవీశాఖ అధికారులు కొత్త సమస్యలు సృష్టిస్తున్నారు. పోడు రైతులకు అటవీ అధికారుల సమస్యల నుంచి కాపాడాలి. వట్టివాగు చెలిమల వాగు కొమురం భీం ప్రాజెక్టులను పూర్తి చేయాలి.

#### ఉప సంఘం పర్యటన శుభపరిణామం

● వెడ్మబొజ్జుపటేల్ ఖానాపూర్ ఎమ్మెల్యే

రైతుభరోసా అమలు కోసం ఉట్నూర్‌లో ఉపసంఘం ఆధ్వర్యంలో వర్క్‌షాప్ ఏర్పాటు చేయడం శుభపరిణామం. పోడు రైతుల సమస్యలు తీవ్రంగా ఉన్నాయి. ప్రభుత్వాన్ని అబాసుపాలు చేయడానికి కొంతమంది అధికారులు కుట్రలుచేస్తున్నారు. ఇలాంటి అధికారులపై చర్యలు తీసుకోవాలి. పోడు భూముల్లో సాగు చేస్తున్న గిరిజనులను కొట్టడంతో పాటుకేసులు పెడుతున్నారని ఇది సరైనది కాదు. అసైన్డ్ భూములకు, పోడు భూములకు పట్టాలు లేక పోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రెవెన్యూశాఖ ద్వారా ఎవరి సాగులో ఉందో పరిశీలించాలి. పట్టాలు లేకపోవడంతో బ్యాంకు రుణాలు అందక ఇబ్బందులు పడుతున్నారు.

#### రైతుబంధుతోనే రైతు భరోసా

● అనిల్‌జాదవ్, బోథ్ ఎమ్మెల్యే

కేసీఆర్ ప్రభుత్వం రైతుబంధు పథకం అమలు చేయడం ద్వారానే కాంగ్రెస్ ప్రభుత్వం రైతుభరోసా పథకాన్ని చేపట్టాడానికి వర్క్‌షాప్ నిర్వహిస్తోంది. బోథ్ నియోజకవర్గంలో కుట్టి ప్రాజెక్టు నిర్మించాలి. దాని ద్వారా ఎత్తిపోతల పథకాలు చేపడితే రైతుల భూములకు సాగునీరు అందుతుంది.

#### ప్రాజెక్టులకు మరమ్మతులు చేపట్టాలి

● కోవలక్ష్మి, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే

ఆసిఫాబాద్ నియోజక వర్గంలోని వట్టివాగు, కొమురంభీం ప్రాజెక్టులకు మరమ్మతులు చేపట్టాలి. ప్రాజెక్టులకు కెనాల్సు నిర్మించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న గిరిజనేతర రైతులకు కూడా రైతుభరోసా పథకం అమలు చేయాలి.

#### కౌలు రైతులను ఆదుకోవాలి

● గడ్డం వివేక్, చెన్నూర్ ఎమ్మెల్యే

కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకోవాల్సిన అవసరం ఉంది. పోడు భూములు సాగుచేస్తున్న రైతులను అటవీశాఖ అధికారులు ఇబ్బందులకు గురి చేయకుండా చూడాలి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అటవీశాఖ ఇబ్బందులు చాలా ఉన్నాయని వాటిని పరిష్కరించే దిశగా ప్రయత్నం చేయాలి.

#### పంటలకు బోనస్ ఇవ్వాలి

● పాల్వాయి హరీష్‌బాబు

రైతులు పండిస్తున్న పత్తిపంట ఎకరానికి 1000, ఇతరపంటలకు 500వంతున బోనస్ ఇవ్వాలి. తమ ప్రాంతంలో పోడుభూముల్లో అటవీశాఖ అధికారులు మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతున్నారని ఇది నిలుపుదల చేయాలి. ఈ ప్రాంతంలో మధ్యతరహా ప్రాజెక్టులు నిర్మించడం ద్వారా రైతుల ప్రయోజనాలుకాపడవచ్చు.

#### బీడు భూములకు రైతుభరోసా వద్దు

● రామారావు పటేల్, ముథోల్ ఎమ్మెల్యే

ప్రభుత్వం అలుచేయనున్న రైతుభరోసా పథకంలో బీడుభూములకు రైతు భరోసా రద్దు చేయాలని శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టు ముందు బాధితుల రైతులకు న్యాయం చేయాలి.

### తాంసిలో చిరుత హతం!?

● రాంనగర్ సమీపంలో కళేబరం ఉన్నట్లు చర్చలు
● చిరుతదా లేక పశువుదా? అనే దానిపై అనుమానలు

తాంసి, జూలై 11: గత కొద్దిరోజులుగా చిరుత పులి సంచారం ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న నేపథ్యంలో తాజాగా రాంనగర్ సమీపంలో చిరుత మృతదేహం లభించినట్లు విన్పిస్తోంది. కుళ్లిపోయిన ఆ కళేబరం చిరుతదా.. లేక పశువుదా.. అనే విషయంలో పలువురు పలు విధాలుగా మాట్లాడుతున్నారు. చిరుతను ఎవరూ చంపారనే విషయంపై కూడా పలు రకాల చర్చలు విన్పిస్తున్నాయి. కొద్దిరోజుల నుంచి చిరుత సంచరించినట్లు కూడా వార్తలు వినిపించాయి. ఈ నేపథ్యంలో కళేబరం చిరుతదేనా.. చిరుతదేఅయితే ఎవరూ చంపి ఉంటారు.. అనే విషయంపై అధికారులు ఆరా తీస్తే విషయం బయటపడే అవకాశాలు ఉన్నాయి.

## పాఠశాలకు ఉపాధ్యాయుల నియామకం

సారంగాపూర్, జూలై 11 : మండలంలో గల దుర్గానగర్ తండాలో పాఠశాలకు విద్యార్థులకు విద్యను బోధించే ఉపాధ్యాయులు లేకపోవడంతో తండా వాసులు బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడడంతో అధికారులు వెంటనే స్పందించి పాఠశాలకు ఉపాధ్యాయుడిని నియమించినట్లు తండావాసులు తెలిపారు. దీంతో పాఠశాలకు బీజేపీ నాయకులు వెళ్లి తండావాసులకు ప్రభుత్వ పాఠశాలపై అవగాహన కల్పించి తండాలలో విద్యను అభ్యసిస్తునటువంటి విద్యార్థులను పాఠశాలకు పంపించాలని పేర్కొన్నారు.



తండా వాసులకు అవగాహన కల్పిస్తున్న బీజేపీ నాయకులు

## 'దురలవాట్లకు దూరంగా ఉండాలి'

బోథ్, జూలై 11 : దురలవాట్లకు దూరంగా ఉండాలని పొగాకు నియంత్రణ విభాగం జిల్లా క్లినికల్ సైకాలజిస్టు శ్రీకాంత్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పొగా కు, ధూమపానం, మద్యం, డ్రగ్స్ వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలు సేవించడం వల్ల అనారోగ్యం పాలు కావడం తో పాటు ప్రాణాలకు హాని చేకూరుతుం దన్నారు. ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని, మత్తు పదార్థాలు సేవిస్తే మానసికంగా ఇబ్బందులకు గురవుతారని పేర్కొన్నారు.

### వ్యాధులు రాకుండా ముందస్తు చర్యలు

నర్సాపూర్(జి), జూలై 11 : మండల కేంద్రంతో పాటు చాక్‌పల్లి గ్రామంలో సీజనల్ వ్యాదులు ప్రబలకుండా గ్రామ పంచాయతీ సిబ్బంది ముందస్తు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా యంపీవో శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య పనులు జరుపుతూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వీణా, నరేష్ కుమార్, సిబ్బంది సమీ, రసూల్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్ అందజేత



విద్యార్థులకు అంద జేసిన బ్యాగులు

ఖానాపూర్, జూలై 11 : మండలంలోని పాత ఎల్లాపూర్ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఆ పాఠశాల పూర్వ ఉపాధ్యాయుడు వాల్గోట్ కిషన్ ఉచితంగా స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గురువారం 36 మంది పాఠశాల విద్యార్థులకు బ్యాగులను అందజేసిన పాఠశాల పూర్వఉపాధ్యాయులు కిషన్‌ను పలువురు అభినందించారు. కిషన్ 12 ఏళ్ల పాటు పాత ఎల్లాపూర్ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యా యులుగా పనిచేసి ఇటీవల స్కూల్‌అసిస్టెంట్‌గా పదోన్నతి పొంది కడెం మండలం లింగాపూర్ వెళ్లారు. తాను పుష్కరకాలం పాటు పని చేసిన పాఠశాల విద్యార్థులపై ఉన్న మమకారంతో వారికి ఉచితంగా బ్యాగులను పంపిణీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పాత ఎల్లాపూర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఏ.రమాదేవి, పాత ఎల్లాపూర్ ఎల్ఎఫ్ఎల్ ప్రధానో పాధ్యాయులు జాదవ్ నెహ్రూ, తదితరులున్నారు.

# భయం భయంగా ప్రయాణం!

- కోతకు గురైన రోడ్డు.. అవస్థలు పడుతున్న ప్రజలు
- అధ్వానంగా సిరికొండ-ఇచ్చోడ మెయిన్ రోడ్డు
- తరచూ ప్రమాదాలు.. పట్టించుకోని అధికారులు



కోతకు గురైన ఇచ్చోడకు వెళ్లే రహదారి

సిరికొండ, జూలై 11: సిరికొండ మండలం నుంచి ఇచ్చోడకు వెళ్లే అధ్వానంగా మారింది. రహదారి పలుచోట్ల కోతకు గురికావడంతో ఈ మార్గంలో ప్రయాణమంటే భయపడుతున్నారు. తప్పనిపరిస్థితుల్లో ప్రజలు ఈ రోడ్డుగుండా పలు ప్రయాణిస్తూ అవస్థలు పడుతున్నారు. గతేడాది కురిసిన భారీ వర్షాలకు సుంకిడి గ్రామ సమీపంలో ఉన్న వాగు వద్ద రోడ్డుపై గల తారు పూర్తిగా వరదకు కొట్టుకుపోగా మరికొన్ని చోట్ల రోడ్డు అంచులు కోతకు గురికావడంతో రోడ్డుపై ప్రయాణించాలంటేనే ప్రజలు జంకుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భీతిల్లుతున్నారు. గతంలో పలుమార్లు వాహనచోధకులు ప్రమాదాలకు గురై ఆసుపత్రుల పాలైన సంఘటనలు అనేకం ఉన్నాయి. రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు కూడా చేయకపోవడంతో రోజు రోజుకు మరింత కోతకు గురవుతూ ప్రమాదకరంగా మారుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.


ఇస్లాంనగర్‌లో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు సాగర్

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఇచ్చోడ, జూలై11: సీజనల్ వ్యాప్తిని అరికట్టడంలో వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఇచ్చోడ పీహెచ్‌సీ వైద్యాధికారి సాగర్ సూచించారు. ఇచ్చోడ మండలంలోని ఇస్లాంనగర్ గ్రామంలో గురువారం ఏర్పాటుచేసిన వైద్యశిబిరంలో గ్రామానికి చెందిన 54 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు వర్షాకాలంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆశ, ఏఎన్‌ఎమ్ సిబ్బంది గ్రామాల్లో సీజనల్ వ్యాధులపట్ల అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించి తల్లిదండ్రులకు వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన చర్యలపై వివరించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

## గంజాయి తరలిస్తున్న నిందితుడి అరెస్ట్

ఆదిలాబాద్ రూరల్, జూలై11: ఆదిలాబాద్ రూరల్ మండలంలోని యాపల్ గూడ గ్రామశివారులో గురువారం ఆదిలాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ ఇన్‌చార్జి ఎస్సై విష్ణు వర్ధన్‌కు నమ్మదగిన సమాచారం రాగా, వారు గ్రామ శివారులో వాహనాల తనిఖీలు చేపట్టగా అక్కడ ఒక వ్యక్తి బుర్నూర్ గ్రామం వైపు నుంచి ఆదిలాబాద్ వైపు ద్విచక్రవాహనంపై వస్తూ పోలీసు వారిని చూసి తన బండిని వెనక్కు తిప్పుకొని పారిపోయే ప్రయత్నం చేయగా ఎస్సై వారి సిబ్బంది అతనిని ఆపి అతని వద్ద ఉన్న కవర్‌లో తనిఖీ చేయగా అందులో గంజాయి దొరికింది. వెంటనే పంచుల సమక్షంలో ఎస్సై ఆ వ్యక్తి వద్ద సోదా చేయగా అతని వద్ద 800 గ్రాముల గంజాయి దొరికింది. అతని పేరు వివరాలు తెలుసుకోగా నిందితుడు పెందూర్ లక్ష్మణ్ బుర్నూర్ వాసిగా గుర్తించారు. పెందూర్ లక్ష్మణ్ గాదిగూడ మండలంలోని కట్టగూడ గ్రామానికి చెందిన మెస్రం లింగు అనే వ్యక్తి వద్ద నుంచి గంజాయి సేకరించి దానిని ఎక్కువ ధరకు అమ్ముకొని లాభం వచ్చే విధంగా అక్రమ సంపాదనకు అలవాటు పడి గంజాయిని తెచ్చి అమ్ముతున్నాడని తెలిసింది. పెందూర్ లక్ష్మణ్ వద్ద 800 గ్రాముల గంజాయితోపాటు బైకు, సెల్‌ఫోన్ సీజ్ చేసుకొని రిమాండ్ కోసం కోర్టులో హాజరుపర్చారు. పెందూర్ లక్ష్మణ్‌కు గంజాయి అమ్మిన వ్యక్తి మెస్రంలింగు ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. ఎవరైనా గంజాయి అమ్మిన, తరలించిన వారి సమాచారం తమకు అందించాలని, అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని సీఐ కె.ఫణిదర్ తెలిపారు.

## పురాతన నాణేల ప్రదర్శన

బోథ్, జూలై11: మండలంలోని సోనాల గ్రామంలో బాశెట్టి రాజ్‌కుమార్ యువకుడు 40దేశాల పురాతన కరెన్సీని ప్రదర్శించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. మహనీయుల జయంతి వర్ధంతిలా నాణేలు నిజాం కాలం నాటి నాణేలు మొగల్ పాలకుడు అక్బర్ కాలం నాటి ప్రార్థన నాణేలను ప్రదర్శించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


వివిధ దేశాల పురాతన కరెన్సీని ప్రదర్శించిన దృశ్యం

## పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

భీంపూర్, జూలై 11 : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని భీంపూర్ వైద్యాధికారి డాక్టర్ నిఖిల్ రాజ్ అన్నారు. గురువారం మండలంలోని రాజుల్‌కోరి గిరిజన గ్రామంలో పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. నీటి నిల్వల వల్ల కలిగే నష్టాలను వివరించారు. అనంతరం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మండల ఆరోగ్య విస్తరణాధికారి లింగంపల్లి జ్ఞానేశ్వర్, పంచాయితీ కార్యదర్శి సూర్యకాంత్, ఆరోగ్య కార్యకర్త విజయలక్ష్మీ ఉన్నారు.

## ప్రతీఒక్కరు మొక్కలు నాటాలి

బోథ్, జూలై11: మండలకేంద్రంలో గురువారం గ్రామ పంచాయతీ ఈవో అంజయ్య ఇంటింటికీ వెళ్లి మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలని, ఇంటికి ఆరు మొక్కలను పంపిణీ చేస్తున్నామని అన్నారు. మొక్కలను తీసుకువెళ్లిన వారు వారి ఇంటి వద్ద నాటాలని సూచించారు. పచ్చని చెట్లతో పర్యావరణాన్ని కాపాడాలని గ్రామస్తులు సూచించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉప ముఖ్యమంత్రిని సన్మానించిన బోథ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు

బోథ్, జూలై11: జిల్లాఉట్నూర్ మండల కేంద్రానినికి వచ్చిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను గురువారం బోథ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆడే గజేందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డితో పాటు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జి.రాజు యాదవ్‌లు శాలువాతో సన్మానించారు. వీరి వెంట స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

## చట్టాలపై విద్యార్థులకు అవగాహన

ఆదిలాబాద్ రూరల్, జూలై11: పట్టణంలోని బంగారిగూడలోని తెలంగాణ మోడల్ స్కూల్‌ను లీగల్ ఎయిడ్ కౌన్సిల్ సభ్యులు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా లీగల్ అవెర్నెస్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. సెల్‌ఫోన్ అధికంగా వాడకం వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ న్యాయ వాది అర్గుల అశోక్, ప్రిన్సిపల్ కె.సంధ్యారాణి పాల్గొన్నారు.


ఇచ్చోడ ప్రభుత్వ కళాశాలలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

## డ్రగ్స్‌కు దూరంగా ఉంటేనే ఉజ్వల భవిష్యత్తు

ఇచ్చోడ, జూలై11: విద్యార్థి దశలో మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు ఎదుగుతారని యాంటీ డ్రగ్స్ కమిటీ బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ అడ్వైజర్ శ్రీకాంత్ అన్నారు. గురువారం ఇచ్చోడ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకునే విద్యార్థిని, విద్యార్థులకు కౌమరదశలో విద్యార్థుల మానసికి స్థితి నుంచి తీసుకోవాలసిన జాగ్రత్తల గురించి వివరించారు. విద్యార్థులు దురలవాట్ల నుంచి దూరంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ గణేష్ కుమార్, ఎన్ఎస్ఎస్ జిల్లా కన్వీనర్ సత్యనారాయణ, అధ్యాపకులు ప్రభాకర్‌రెడ్డి, సోమేశ్వర్ పాముల పాల్గొన్నారు.

## సహకార ఆర్థిక సంస్థ చైర్మన్‌ను కలిసిన కౌన్సిలర్

ఆదిలాబాద్ అర్బన్, జూలై 11 :తెలంగాణ వెనుకబడిన తరగతుల సహకారఆర్థిక సంస్థ చైర్మన్ (బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్)గా బాధ్యతలు చేపట్టిన నూతిశ్రీకాంత్‌గౌడ్‌ని ఓబీసీ జిల్లా అధ్యక్షుడు, కౌన్సిలర్ అంబకంటి అశోక్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం హైదరాబాద్‌లోని బీసీ సంక్షేమ భవనంలో చైర్మన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువా, పూలమాలతో సత్కరించారు. ఇందులో జిల్లా నాయకులు తదితరులున్నారు.

## శిథిలావస్థకు చేరిన భవనాలను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్

ఆదిలాబాద్ రూరల్, జూలై11: జిల్లాకేంద్రంలోని శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారినభవనాల కూల్చివేతకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశాల మేరకు మున్సిపల్ యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా గురువారం అశోక్ రోడ్ ఏరియాల్లో ఉన్న పాతభవనాలను మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్ పరిశీలించారు. ఈ సందర్భంగా యజమానులతో మాట్లాడి ప్రమాదం సంభవించక ముందే భవనాలను ఖాళీ చేయాలని సూచించారు. ఆయన వెంట మున్సిపల్ అధికారులు ఉన్నారు.


పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్‌జేడీ

## మధ్యాహ్న భోజనంపై నిర్లక్ష్యం వద్దు

● ఆర్‌జేడీ సత్యనారాయణ

బోథ్, జూలై11: ఏజెన్సీలు అప్రమత్తంగా ఉండాలని ఆర్‌జేడీ సత్యనారాయణ సూచించారు. గురువారం మండలంలోని సోనాల గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తనిఖీచేశారు. ఈసందర్భంగా ఆయన పాఠశాలలో పరిసరాలను పరిశీలించి చెత్తాచెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఆరవ తరగతి, పదవ తరగతి విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించి డిపాజిట్ ప్యానెల్ బోర్డును వినియోగించే విధానాన్ని వివరించారు. విద్యార్థినులకు నూతన మూత్రశాలలు లేక ఇబ్బందులకు గురవుతున్నారని, మూత్రశాలల నిర్మాణం పూర్తయినా తమకు అప్పగించకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నామని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నర్సయ్య ఆర్‌జేడీకి వివరించారు. అంతేగాక నూతనంగా నిర్మిస్తున్న పాఠశాల భవనాన్ని పరిశీలించారు. అంతకు ముందు పాఠశాల రికార్డులను చూసి సంతృప్తి వ్యక్తపరిచారు.

## 'జనాభా నియంత్రణతోనే దేశం అభివృద్ధి'

ఆదిలాబాద్ రూరల్, జూలై11: జనాభా నియంత్రణతోనే దేశాభివృద్ధి చెందుతుందని డీఎంహెచ్‌వో డాక్టర్ నరేందర్ రాథోడ్ పేర్కొన్నారు. గురువారం ప్రపంచ జనాభా నియంత్రణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదిలాబాద్ పట్టణంలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ సమావేశ మందిరంలో ఆయన మాట్లాడారు. పరిమిత కటుంబంతోనే ఆ కుటుంబం ఆరోగ్య పరిస్థితి ఆర్థిక అభివృద్ధి తోడ్పడుతుందని పేర్కొన్నారు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌పై ప్రజలలో అవగాహన కల్పించాలన్నారు.

## తిరుపతి హుండీ డబ్బులు రూపాయి వడ్డీకే ఇస్తామంటూ మోసం

- ఆన్‌లైన్ నమోదుకు డబ్బులు వసూలు
- మోసపోయిన గిరిజనులు

బోథ్, జూలై11: ఒకవైపు ప్రతీరోజు ఆన్‌లైన్ మోసాలను వింటూనే ఉన్నాం.. అయినా మారుమూల గిరిజన గ్రామాల్లో రూపాయికి లక్షల్లో రుణం ఇస్తామంటూ చెప్పిన మోసగాడిని నమ్మి గిరిజనులు మోసపోయారు. తిరుమల తిరుపతి దేవస్థానం హుండీ డబ్బులు రూపాయి వడ్డీకే డబ్బులు ఇస్తారని, ఇందుకు ఆధార్‌కార్డు నెంబర్‌పై లోన్ మంజూరు కోసం ఆన్‌లైన్ చేయాల్సి ఉంటుందని పెద్దగూడ గిరిజనులను ఓ వ్యక్తి నమ్మించాడు. అంతేగాక ఒక్కో వ్యక్తి దగ్గర రూ.1800 తీసుకుని పరారైన ఘటన వెలుగులోకివచ్చింది. ఇందుకు సంబంధించిన వివరాలు గిరిజనులు తెలిపిన ప్రకారం ఇలా ఉన్నాయి. మండలంలోని పెద్దగూడ గ్రామానికి బుధవారం ఓ అపరిచితుడైన వ్యక్తి ద్విచక్ర వాహనంపై వచ్చి గిరిజనులకు రూపాయి వడ్డీకి లక్షల రుణం ఇస్తామని వివరించారు. అందుకు ఆధార్‌కార్డు నెంబర్ ఇవ్వాలని ఆధార్‌కార్డు ఆన్‌లైన్ చేసి రుణం మంజూరీ కోసం రూ.1800 చెల్లించాలని వివరించారు. దీంతో అమాయకులైన ఎనిమిది మంది గిరిజనులు వారి ఆధార్‌కార్డు నెంబర్లను ఇచ్చారు. అయితేతాను ఈరోజే ఆధార్‌కార్డులు ఆన్‌లైన్‌చేస్తానని వివరించారు. దీంతో అమాకులైన గిరిజనులు ఎనిమిది మంది 1800 చొప్పున చెల్లించారు. అయితే రేపు నాకు ఫోన్‌చేయాలని, గిరిజనులకు ఫోన్ నెంబర్ సైతం ఇచ్చి వెళ్లాడు. గురువారం 1800 చెల్లించిన రైతులు సదరు వ్యక్తి ఇచ్చిన సెల్‌ఫోన్ నెంబర్‌కు కాల్ చేయగా ఫోన్ నెంబర్ పని చేయడం లేదని పెద్దగూడ గిరిజనులు వాపోయారు. ఏది ఏమైనా ఆదివాసి గిరిజనులను మోసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## సవాళ్లను ఎదుర్కొని దివ్యాంగులు ఎదగాలి

● డీఆర్‌డీవో విజయలక్ష్మి


దివ్యాంగ విద్యార్థికి ప్రోత్సాహక బహుమతిని ప్రదానం చేస్తున్న డీఆర్‌డీవో విజయలక్ష్మి

భైంసా, జూలై 11 : ప్రణాళికబద్ధమైన విధానాల ద్వారా దివ్యాంగులందరూ అన్ని రంగాల్లో సవాళ్లను ఎదుర్కొని ధీటుగా ఎదగాలని డీఆర్‌డీవో విజయలక్ష్మి పిలుపునిచ్చారు. గురువారం భైంసా పట్టణంలోని ఐకేపీ కార్యాలయంలో దివ్యాంగ్‌శక్తి ఫౌండేషన్ ఆద్వర్యంలో పది, ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన దివ్యాంగ విద్యార్థులకు నిర్వహించిచన సన్మానసభ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. దివ్యాంగ విద్యార్థులు అవిటితనం అనే భావనను తొలగించుకొని భవిష్యత్తును బంగారుమయం చేసుకునే దిశగా ముందుకు సాగాలన్నారు. ఉన్నత చదువులు చదివి, ఉత్తమ ఫలితాలతో ఉన్నత శిఖరాలను అదిరోహించి జీవితాల్లో స్థిరపడాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగపరుచుకొని ఉద్యోగ, ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఇందులో భైంసా ఎంఈవో సుభాష్, ఏరియా ఆసుపత్రి చిన్న పిల్లల వైద్య నిపుణులు డా.విజయానంద్, , దివ్యాంగ్ శక్తి ఫౌండేషన్ ప్రతినిధి పంచగూడేం మహేష్, ఏపీఎం లక్ష్మణ్, దివ్యాంగ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత



**దిలావర్‌పూర్ :** పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి విజయలక్ష్మి అన్నారు. వన మహోత్సవంలో భాగంగా గురువారం మండలంలోని న్యూ లోలంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు ఎంతగానో తోడ్పడుతాయని, విరివిగా మొక్కలు నాటి కంటికి రెప్పలా కాపాడుకోవాలన్నారు. ఆ మొక్కలే వృక్షాలై మనల్ని కాపాడుతాయని చెప్పారు. పుట్టిన ప్రతి ఒక్కరు బాధ్యతగా ఒక మొక్కనాటి పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో పూండ్రు దివ్యరెడ్డి, వెంకటరమణ, ఎఫ్ఏ మహేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మానవ మనుగడకు మొక్కలు ఎంతో అవసరం

కుంటాల, జూలై, 11: మానవ మనుగడకు మొక్కలు ఎంతో అవసరమని డీఆర్‌డీవో విజయలక్ష్మి అన్నారు. గురువారం మండలంలోని కల్లూరు గ్రామంలో కస్తుర్బా పాఠశాల, నర్సరీలను పరిశీలించారు. అనంతరం అందకూర్ గ్రామపంచాయతీలో అవెన్యూ ప్లాంటేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షాలు సమృద్ధిగా కురియాలన్న, వాతా వరణంలో కాలుష్యాన్ని నివారించాలన్న మొక్కలు ఎంతో అవసరమని, కావున ప్రతి ఒక్కరు మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. మొక్కల పెంపకం వల్ల కలిగే లాభాలను ప్రజలకు అధికారులు వివరిం చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రహీం, ఏపీవో నవీన్, ఏపీఎం అశోక్, ఉపాధి సిబ్బంది జైసింగ్, కార్తీక్, ఎఫ్ఏ రాందాస్, భోజన్న తదితరులు పాల్గొన్నారు.

# ఇళ్లను అప్పజెప్పాలని డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారుల ఆందోళన

- భైంసా ప్రధాన రోడ్డు మార్గంలో నిరసన ర్యాలీ
- ఎమ్మెల్యే రాంరావ్ పాటిల్‌కు వినతిపత్రం అందజేత


భైంసాలో డబుల్ బెడ్‌రూమ్ లబ్ధిదారుల ర్యాలీ


ఎమ్మెల్యేకు సమస్యలను విన్నవిస్తున్న లబ్ధిదారులు

భైంసా, జూలై 11 : ఏడాది కాలం క్రితం లక్కీ డ్రా ద్వారా లబ్ధిదారులుగా ఎంపికైన తమకు ఇళ్లను అప్పజెప్పాలంటూ భైంసా పట్టణ డబుల్ బెడ్‌రూమ్ లబ్ధిదారులు గురువారం ఆందోళనలు చేపట్టారు. ఉదయం ఇక్కడి విశ్రాంతి భవనం వద్ద భేటీ అయిన లబ్ధిదారులు ప్రధానరోడ్డు మార్గంలో ఇళ్లను అప్పచెప్పాలని డిమాండ్ చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వానికి, ప్రజా ప్రతినిధులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాలయాపన విధానాలను నిరసిస్తూ ప్రదర్శనలు జరిపారు. అనంతరం ర్యాలీగా నాందేడ్ క్రాస్ రోడ్డు మార్గంలోని ముథోల్ ఎమ్మెల్యే రాంరావ్ పాటిల్ నివాస గృహానికి తరలివెళ్లారు. అక్కడ ఇండ్లు అప్పజెప్పాలని డిమాండ్ చేస్తూ ప్రదర్శనలు చేపట్టారు. ఎమ్మెల్యే రామరావ్ పాటిల్‌కు తాము ఎదుర్కొంటున్న కష్టనష్టాలను ఏకరువు పెట్టారు. అద్దెలు చెల్లించలేక అవస్థలు పడుతున్నామని వాపోయారు. డబుల్ బెడ్ రూమ్ గృహ సముదాయాల్లో వసతులు, సౌకర్యాలు కల్పించి తమకు అప్పచెప్పే విధంగా చర్యలు చేపట్టాలని మొర పెట్టుకున్నారు. నెలరోజులుగా తాము ఇళ్ల కోసం అష్టకష్టాలు పడుతున్న గోస పట్టించుకునే వారే కరువయ్యారని అవేదన వ్యక్తం చేశారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్ సంబంధిత సమస్యను ప్రభుత్వం,ఉన్నతాధికారుల దృష్టికి తీసుకవెళ్లి పరిష్కరింప చేసేందుకుగాను బాధ్యతాయుతంగా పాటుపడుతానని హామీ ఇచ్చారు. త్వరితగతిన అన్ని రకాల మౌలిక వసతులు, సౌకర్యాలు కల్పించి లబ్ధిదారులకు ఇళ్లను అప్పచెప్పేందుకు అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకుంటానని స్పష్టం చేశారు. ఇందులో భైంసా మాజీ ఎంపీపీ అబ్దుల్ రజాక్, సీపీఐఎంఎల్ ప్రతినిధి రాజు, బీఆర్ అంబేడ్కర్ సంఘాల ప్రతినిధి గిరిధర్ జంగ్మేతో పాటు పలువురు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులతో కిక్కిరిసిపోతున్న ఆసుపత్రులు

- ప్రభుత్వ ఆసుపత్రుల్లో రెట్టింపైన అవుట్ పేషెంట్‌లు


భైంసాలోని ఓపీడీ బ్లాక్ వద్ద కిక్కిరిసిన రోగులు

భైంసా, జూలై 11 : వర్షాకాలం ఆరంభమైన నేపథ్యంలో వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులతో సీజనల్ వ్యాధుల బెడద ఆరంభమయ్యింది. ఎక్కడ చూసినా జ్వర బాధితులతో పాటు జలుబు, శ్వాసకోశ సంబంధిత వ్యాధులు, వాంతులు, విరేచనాలు,ఒళ్లు నొప్పులతో బాధపడుతున్న రోగులు కన్పిస్తున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులన్నీ చికిత్సల కోసం వస్తున్న రోగులతో కిక్కిరిసిపోయి కనిపిస్తున్నాయి. ఆర్థిక పరిపుష్టి కలిగిన వ్యాధుల బాధితులు ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తుండగా ఇతరులంతా ప్రభుత్వ ఆసుపత్రులకు క్యూ కడుతున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వ ఆసుపత్రులలోని అవుట్ పెషెంట్ విభాగాల్లో చికిత్స కోసం వస్తున్న రోగుల సంఖ్య ఇది వరకటితో పోల్చి చూస్తే రెట్టింపు స్థాయికి చేరుకుంది. భైంసా ఏరియా ఆసుపత్రిలోని అవుట్ పెషెంట్ విభాగంలో గత నెల వరకు సరాసరి 350 నుంచి 375 మంది వరకు రోగులకు చికిత్సలు పొందేవారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధుల బెడద అధికమయిన నేపథ్యంలో గత పది రోజులుగా ఇక్కడి ఆసుపత్రిలోని అవుట్ పెషెంట్ విభాగంలో 625 నుంచి 675 మంది వరకు రోగులకు చికిత్సల కోసం వస్తున్నారు. రోగుల రద్దీతో ఆసుపత్రిలోని అన్ని ఓపీడీ బ్లాక్‌లు కిక్కిరిసిపోతున్నాయి. ప్రధానంగా చిన్న పిల్లల, మహిళల విభాగాల్లోని బ్లాక్‌ల వద్ద చికిత్సల కోసం రోగులు తోసుకుంటున్నారంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో చెప్పకుండానే తెలిసిపోతోంది. సీజనల్ వ్యాధులపై గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన సదస్సులు నిర్వహించి ప్రజలు రోగాల బారిన పడకుండా జాగృత పరిచే చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

# మాజీ ఎంపీకి ఘన నివాళులు



నిర్మల్ కల్చరల్, జూలై 11 : మాజీ పార్లమెంట్ సభ్యుడు దివంగత రమేష్ రాథోడ్‌కు గురువారం జిల్లా బీజేపీ కార్యాలయంలో నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండల లక్ష్మీనారాయణ హాజరై మాట్లాడుతూ.. రమేష్ రాథోడ్ ఆకస్మిక మృతి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు, పార్టీకి తీరని లోటన్నారు. ఎమ్మెల్యే, జడ్పీ చైర్మన్, ఎంపీగా ఆయన జిల్లా ప్రజ లకు ఎనలేని సేవలందించారని కొనియాడారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శులు సామ రాజేశ్వర్‌రెడ్డి, మేడిసెమ్మె రాజు, రాచకొండ సాగర్, శ్రావణ్‌రెడ్డి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

## నిర్మల్‌లో ప్రపంచ జనాభా దినోత్సవ ర్యాలీ


నిర్మల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది

నిర్మల్ కల్చరల్, జూలై 11 : ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పుర స్కరించుకొని శుక్రవారం జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. జిల్లా వైద్యాధికారి ధనరాజ్ మాట్లాడుతూ... జనాభా పెరుగుదల వల్ల జరిగే అనర్థాలు ప్రజలకు వివరించేందుకు జూలై 11న ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరు కుటుంబ నియంత్రణ పాటించి జనాభా పెరుగుదలను అరికట్టాలన్నారు. ఉప వైద్యాధికారి రాజేందర్, డాక్టర్ శ్రీనివాస్, సౌమ్య, విస్తరణ అధికారి రవీందర్, ఈవో వేణు రావు, సూపర్‌వైజర్లు భోజారెడ్డి, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## చెరువును సందర్శించిన బీజేపీ నాయకులు

నిర్మల్ కల్చరల్, జూలై 11 : చెరువుకు దరువు - వరదకు అడ్డు కార్యక్రమంలో భాగంగా బీజేపీ నాయకులు గురువారం పట్టణంలోని గొలుసుకట్టు చెరువులను, సమీప చెరువులు సందర్శించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... చెరువులను రియల్టర్లు ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని అన్నారు. చారిత్రాత్మక చెరువుల అస్తిత్వం ప్రమాదంలో పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. చెరువు భూములు కాపాడాలని హైకోర్టు ఆదేశించిన అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని లేకుంటే ప్రజలతో కలిసి ఆందోళన చేపడ తామన్నారు. అధ్యక్షుడు అంజు కుమార్‌రెడ్డి, నాయకులు రాంనాథ్, మేడి సెమ్మె రాజు, రాజేశ్వర్‌రెడ్డి, అలివేలు, సాగర్, అరవింద్ పాల్గొన్నారు.

andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 32.7 ၊ కనిష్ఠం 25.8



నిర్మల్ జిల్లా వార్తలు

శుక్రవారం 12 జూలై 2024

## విద్యార్థులకు బస్సు సౌకర్యం

నిర్మల్ కల్చరల్, జూలై 11 : నిర్మల్ పట్టణం కస్బా ఉన్నత పాఠశాల విద్యార్థులు సకాలంలో హాజరయ్యేందుకు ఆర్టీసీ అధికారులు మహాలక్ష్మి ఆలయం నుంచి ప్రత్యేక బస్సు సౌకర్యాన్ని గురువారం ప్రారంభించారు. బాగులవాడలో నివసించే వారికి మహాలక్ష్మి ఆలయం వద్ద డబుల్ బెడ్ రూమ్‌ల ఇళ్లు మంజూరు కావడంతో వారంతా అక్కడికి మారారు. వారి పిల్లలు 72 మంది వరకు కస్బా ఉన్నత పాఠశాలలో చదువుతున్నారు. వారి ఇబ్బంది గుర్తించి అధికారులు ప్రత్యేక బస్సు నడిపించేందుకు అంగీకరించారు. పీఆర్టీయూ అధ్యక్షుడు సాయన్న, ఈ సందర్భంగా అధికారులకు అభినందనలు తెలిపారు.



గేట్ల మరమ్మతు చేస్తున్న మెకానికల్ సిబ్బంది (ఫైల్)



కడెం ప్రాజెక్టు (ఫైల్)

# కడెం ఆయకట్టు అన్నదాతల్లో చిగురిస్తున్న ఆశలు





కడెం ప్రాజెక్టు రెండో నెంబర్ గేటు వద్ద కౌంటర్‌వేట్ బిగిస్తున్న దృశ్యం

- పూర్తవుతున్న ప్రాజెక్టు మరమ్మతు పనులు
- ఇక మరో వారం రోజుల్లోపే పనులు పూర్తి కాబోతున్నాయంటున్న అధికారులు
- ఇప్పటికే సిద్ధమైన 17 గేట్లు
- రెండవ నెంబర్ గేటుకు కౌంటర్ వేట్ బిగిస్తే కడెం సిద్ధమైనట్లేనంటున్న అధికారులు
- వానాకాలం పంటపై ఆయకట్టు రైతుల్లో పెరుగుతున్న భరోసా
- కడెం కింద తిరిగి సాగులోకి రానున్న 60 వేల ఎకరాల ఆయకట్టు

నిర్మల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : వరుసగా గత రెండేళ్లుగా వచ్చిన భారీ వరదల కు కడెం ప్రాజెక్టు దెబ్బతినడంతో రెండేళ్లుగా పంట నష్టపోతున్న ఆయకట్టు రైతాంగం లో క్రమేపి ఈ వానాకాలం పంటపై ఆశలు చిగురిస్తున్నాయి. గత ఏడాది ఆరు లక్షల క్యూసెక్కులకు పైగా వచ్చిన వరదను తట్టుకొని నిలబడిన కడెం ప్రాజెక్టు గేట్లు పూర్తి స్థాయిలో దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ప్రాజెక్టు మరమ్మతులకు సీఎం రేవంత్‌రెడ్డి యుద్ధ ప్రాతిపదికన నిధులు మంజూరు చేశారు. మెకానికల్ పనుల నిర్వహణకు రూ.5.46 కోట్లు, ఎలక్ట్రికల్ పనుల నిర్వహణకు రూ.3.81 కోట్లు నిధులు మంజూరు చేశారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేశాక టెండర్లు పిలిస్తే మొదటిదశలో ఎవరూ ముందుకు రాకపోవడంతో ప్రాజెక్టు పనులపై ఎన్నో ప్రశ్నలు తలెత్తాయి. ఆ తర్వాత ప్రభుత్వం రీటెండర్లు నిర్వహిస్తే హైదరాబాద్‌కు చెందిన ఓ ప్రైవేట్ కంపెనీ పనులను దక్కించుకుంది. ఒక దశలో మే నెలాఖరి వరకు పనులు పూర్తి చేయాలనుకున్న అధికారులు జూన్ రెండవతేదీ లోపు పనులు పూర్తి చేయాలని కంపెనీ నిర్వాహకులకు అల్టిమేటం జారీ చేశారు. ఈ నేపథ్యంలో ఆశించిన సమయానికి పనులు పూర్తికాపోయినప్పటికీ వర్షాలు ఎక్కువగా కురువకపోవడంతో కడెం ప్రాంత ప్రజలతో పాటు అధికారులు సైతం ఊపిరి పీల్చుకున్నారు. గడువులోపు పనులు పూర్తి కాకపోవడంతో ప్రభుత్వం నుంచి అధికారులపై ఒత్తిడి పెరగడంతో యుద్ధ ప్రాతిపదికన ప్రాజెక్టు వద్ద పనుల నిర్వహణ జరుగుతోంది. ప్రస్తుతం కడెం ప్రాజెక్టు మరమ్మతులు చివరిదశకు చేరుకోవడంతో ఆయకట్టు రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయంటున్నారు.

### మరో వారంలో సిద్ధం కానున్న కడెం ప్రాజెక్టు

కడెం ప్రాజెక్టు మరమ్మతులు చివరిదశకు చేరుకోవడంతో మరో వారం రోజుల్లో ప్రాజెక్టు పూర్తిస్థాయిలో సిద్ధమవుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే ప్రాజెక్టు 17 గేట్ల మరమ్మతులు పూర్తయ్యాయని అధికార యంత్రం వెల్లడిస్తోంది. 17 గేట్ల తాలూకు పలు మార్లు ట్రయల్‌రన్ సైతం నిర్వహించామని, ఎంతటి భారీ వరదలు వచ్చినా ఈసారి ఖచ్చితంగా గేట్లలో ఎటువంటి లోపం తలెత్తే అవకాశ లేదంటున్నారు. మెకానికల్ పనులతో పాటు ఈ 17 గేట్లకు ఎలక్ట్రోలైన్స్ సైతం పూర్తయ్యాయని చెబుతున్నారు. కడెం ప్రాజెక్టు మరమ్మతుల కోసం తెలంగాణ ప్రభుత్వం రూ. 5.46కోట్లు మెకానికల్ పనుల కోసం, రూ.3.81 కోట్ల నిధులు ఎలక్ట్రికల్ పనుల కోసం మంజూరు చేయగా ప్రస్తుతం ప్రాజెక్టు వద్ద రూ.3 కోట్ల నిధులతో మెకానికల్ పనులు, రూ.ఒక కోటి నిధులతో సీసీ పనులు నిర్వహిస్తున్నారు. ఎలక్ట్రికల్ బండ్ల కోసం మంజూరు చేసిన 3.81 కోట్ల రూపాయల నిధులతో ప్రాజెక్టు వద్ద ట్రాన్స్‌ఫార్మర్లు, టవర్ కేబుల్స్, 60 లైట్లు, ప్యానల్ బోర్డులతో పాటు ఇతరత్రా ఎలక్ట్రికల్ పనులు నిర్వహిస్తామని చెబుతున్నారు. ప్రస్తుతం ఈ పనుల్లో భాగంగా 250 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి ప్రాజెక్టు వద్ద 24 గంటల పాటు విద్యుత్ ఉండేలా నేరుగా విద్యుత్ కనెక్షన్లను సిద్ధం చేసినట్లు అధికారులు చెబుతున్నారు. 160 కేవీఏ కెపాసిటీ గల డీజిల్ జనరేటర్ సైతం ప్రాజెక్టు వద్ద అందుబాటులో ఉంచినట్లు అధికార యంత్రం చెబుతుంది. ప్రస్తుతం ప్రాజెక్టు 17 గేట్లు పూర్తయిన నేపథ్యంలో కేవలం ఒక్క గేటు మరమ్మతు పనులు మాత్రమే మిగిలి ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. రెండవ నెంబర్ గేటుకు కౌంటర్ వేట్ ఏర్పాటు చేస్తే పూర్తిస్థాయిలో గేట్లు సిద్ధమవుతాయని అధికార యంత్రాంగం వెల్లడిస్తోది. ఈ కౌంటర్ వేట్ ఏర్పాటు కోసం ఓ నాలుగైదు రోజుల సమయం పడుతుందని అంచనా వేస్తున్నారు. మొత్తానికి వారం రోజుల్లోపే కడెం ప్రాజెక్టును సిద్ధం చేస్తామని అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

### ఆగస్టు మొదటి వారంలో ఆయకట్టుకు నీటి విడుదల..!

ప్రాజెక్టు ద్వారా జిల్లాలోని ఖానాపూర్ నియోజకవర్గం, మంచిర్యాల నియోజకవర్గం పరిధిలో ఉన్న పలు మండలాలకు సాగునీరు అందుతోంది. ఈ రెండు నియోజకవర్గాలలో కడెం ప్రాజెక్టు ద్వారా అధికారికంగా 60 వేల ఎకరాలకు సాగు నీటిని అందజేస్తారు. తాజాగా ప్రాజెక్టు మరమ్మతు పనులు పూర్తికానున్న నేపథ్యంలో ఆయకట్టుకు వానాకాలం పంట కోసం నీటి విడుదల చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఎగువన కురుస్తున్న వర్షాలకు కడెం ప్రాజెక్టులోకి క్రమేపి వరదనీరు వచ్చి చేరుతుంది. ఈ నేపథ్యంలో కడెం ప్రాజెక్టులో నీటిమట్టం పెరుగుతుంది. 17 గేట్లు సిద్ధమవడంతో వచ్చిన వరదనీటిని సైతం ప్రాజెక్టు నుంచి బయటికి పోకుండా ప్రాజెక్టులోనే ఒడిసిపట్టే వెసులుబాటు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. కేవలం మరొక గేటుకు మాత్రమే మరమ్మతులు మిగిలి ఉన్న నేపథ్యంలో ఆగస్టు మొదటివారం వరకు ప్రాజెక్టులో ఆశించిన స్థాయిలో నీటిమట్టం ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 700ల అడుగులు కాగా ప్రస్తుతం 683.200 అడుగులకు చేరుకుంది. పూర్తిస్థాయి ప్రాజెక్టు నీటిసామర్థ్యం 7.603 టీఎంసీలు కాగా ప్రస్తుతం 3.996 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో మరిన్ని వర్షాల గురించి ప్రాజెక్టులోకి భారీగా వరదనీరు చేరుతుందని అంచనా వేస్తున్నారు. అనుకున్నట్లు అన్ని జరిగి పనులు వారం రోజుల్లోపు పూర్తయితే ఆగస్టు మొదటివారంలో కడెం ఆయకట్టుకు నీటి విడుదల చేయడం ఖాయమని అధికార వర్గాలు వెల్లడిస్తున్నాయి.

### సాగులోకి రానున్న 60 వేల ఎకరాల ఆయకట్టు

రెండేళ్లుగా వచ్చిన భారీ వరదలతో వరుసగా పంటలను కోల్పోతున్న కడెం ఆయకట్టు రైతన్నల ముఖంలో కొత్త ఉత్సాహం కనిపించనుంది. ఇక కడెం ప్రాజెక్టు మరమ్మతు పనులు చివరిదశకు చేరిన నేపథ్యంలో ఆగస్టు మొదటివారంలో ఆయకట్టుకు నీటి విడుదల చేయడం ఖాయమనే అభిప్రాయాలను అధికారులు వెల్లడిస్తున్న నేపథ్యంలో ఈ ఏడాది వానాకాలం పంటపై ఆయకట్టు రైతాంగంలో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. దీంతో కడెం కింద ఈ ఏడాది తిరిగి 60 వేల ఎకరాల వ్యవసాయ భూములు సాగులోకి రానున్నాయని అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. వరుసగా రెండేళ్లపాటు పంటలకు దూరమైన కడెం ఆయకట్టు రైతాంగం ఎట్టకేలకు మరికొద్ది రోజుల్లో తీపి కబురు వినిపిస్తుందని చెబుతున్నారు. ప్రాజెక్టు మరమ్మతు పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ప్రభుత్వం పెట్టుకున్న లక్ష్యం నెరవేర్చేలా స్థానికంగా ఎమ్మెల్యే బొజ్జు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కలు అధికారులను ఎప్పటికప్పుడు అప్రమత్తంగా చేస్తూ నిరంతర పర్యవేక్షణ నిర్వహించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### నాలుగైదు రోజుల్లో పూర్తిస్థాయిలో పనులు పూర్తి



17 గేట్ల తాలూకు మరమ్మతు పనులన్నీ పూర్తయ్యాయి. ఇదివరకే పలుమార్లు ట్రయన్ రన్స్ సైతం చేశాము. కేవలం ఒక్క రెండవ నెంబర్ గేటు తాలూకు కౌంటర్ వేట్ మాత్రమే బిగించాల్సి ఉంది. అది కూడా నాలుగైదు రోజుల్లో పూర్తి చేస్తాం. ప్రాజెక్టు వద్ద పూర్తిస్థాయిలో పనులు పూర్తయ్యి నాలుగైదు రోజుల్లో ప్రాజెక్టు సిద్ధమవుతుంది. మెకానికల్ పనులతో పాటు గేట్ల తాలూకు ఎలక్ట్రికల్ పనులు సైతం పూర్తయ్యాయి.

- భోజదాస్ ( డీఈఈ, కడెం ప్రాజెక్టు )

## సాయిబాబా ఆలయంలో న్యాయాధికారి ప్రత్యేకపూజలు



న్యాయాధికారికి ప్రసాదం అందజేస్తున్న లక్కిడి జగన్మోహన్‌రెడ్డి

నిర్మల్ కల్చరల్, జూలై 11 : నిర్మల్‌లోని గండి రామన్న సాయిబాబా ఆలయంలో సాయినాథుడికి జిల్లా న్యాయాధికారి కర్ణకుమార్ గురువారం ప్రత్యేకపూజలు చేశారు. సాయి సేవా సమితి అధ్యక్షుడు లక్కడి జగన్మోహన్‌రెడ్డి ఆయనను శాలువాతో సన్మానించి ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పూదరి నరహరి, సారంగాపూర్ మండలం అడెల్లి గ్రామానికి చెందిన రాజేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

## 'సీసీ రోడ్ల నిధుల వాడకం అవాస్తవం'



పోలీసుస్టేషన్ ఎదుట వివరాలు వెల్లడిస్తున్న గ్రామ నాయకులు

లక్ష్మణచాంద, జూలై 11 : మండలంలోని చామన్‌పెల్లి గ్రామానికి సంబంధించిన సీసీ రోడ్ల నిధులు వాడుకున్నది నిజం కాదని గురువారం తేలింది. గ్రామంలో గతంలో నిర్మాణం చేపట్టిన సీసీ రోడ్లకు సంబంధించి రూ. 1,69,785ల నిధులను ఇవ్వకుండా స్థానిక మాజీ సర్పంచ్ ఏనుగు రాంరెడ్డి వాడుకున్నాడని అదే గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ చొక్కాల బాపయ్య గత ఏప్రిల్ 1న ఆరోపిస్తూ గ్రామ పంచాయతీ ముందు నిరసన తెలిపాడు. ఈ సంఘటనను ఖండిస్తూ అందుకు సంబంధించి బ్యాంకు స్టేట్‌మెంట్ ఇతర ఆధారాలు పోలీసులు సేకరించగా నిధులు వాడుకున్నది నిజం కాదని తేలిందన్నారు. అనవసరంగా ఆరోపించినందున బాపయ్యపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వారు వివరించారు. ఈ కార్యక్రమంలో వెంకట్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, సురకంటి ప్రసాద్ రెడ్డి, ఎంజలి ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై దాడి.. నగదు, సెల్‌ఫోన్లు సీజ్

నర్సాపూర్(జి), జూలై 11 : మండల కేంద్రంలోని కొచ్చెరువులో పేకాట ఆడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు గురువారం రాత్రి ఏడు గంటల సమయంలో ఎస్సై మునిగెల హన్మాండ్లు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఇద్దరు వ్యక్తులను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకోగా ఇద్దరు వ్యక్తులు పారిపోయినట్లు తెలిపారు. వారి వద్ద నుండి రెండు సెల్‌ఫోన్లు నగదు ఒకవేయి యాభై, యాభై రెండు పేకముక్కలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై మునిగెల హన్మాండ్లు తెలిపారు.

## 'గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల చేయండి'

నిర్మల్ కల్చరల్, జూలై 11 : గ్రామ పంచాయతీలకు పెండింగ్ నిధులు వెంటనే విడుదల చేయాలని టీఏజీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బైరి సోమేష్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. గురువారం తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘ జిల్లా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా కార్యదర్శి తొడసం శంఖు అధ్యక్షత వహించారు. నిధులు లేక అభివృద్ధి పనులు కుంటుపడుతున్నాయని, కార్మికులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితి ఉందన్నారు. పంచాయతీలకు నిధుల మంజూరుపై ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు.

## విపత్తు రక్షణచర్యలపై అవగాహన పెంచుకోవాలి

● భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్

భైంసా, జూలై 11 ; విపత్తుల సమయంలో తమను తాము రక్షించుకోవడంతో పాటు ఇతరులను రక్షించే చర్యలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్ సూచించారు. గురువారం భైంసా పట్టణంలోని గడ్డెన్న ప్రాజెక్టు వద్ద డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో వరదల్లో చిక్కుకున్న వారిని రక్షించే చర్యలపై మాక్ డ్రిల్, అవగాహన నిర్వహించిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఎవరికి వారే తమ రక్షణకు కొన్ని జాగ్రత్తలు తప్పకుండా తీసుకోవాలన్నారు. అన్ని వేళలా పోలీసు, ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు అందుబాటులో ఉండవన్నారు. విపత్తులు ఏర్పడినపుడు సంభవించే ప్రమాదాల్లో చిక్కుకున్నపడు రక్షించుకునే చర్యలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇదే క్రమంలో ప్రమాదాల్లో చిక్కుకున్న వారిని కాపాడే విధానాలపై సైతం అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ప్రకృతి, వైపరీత్యాలు ఎదుర్కోవడానికి ముందుగా మానవ చైతన్యం ఎంతో అవసరమని, అప్పుడే ప్రాణ నష్టం, ఆస్తి నష్టం నివారించగలిగిన వారవుతారన్నారు. విపత్తుల నుంచి కాపాడుకునే, కాపాడే సమయంలో సమయస్ఫూర్తి, అప్రమత్తత ప్రధానమని వివరించారు. ఈ సందర్భంగా డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ప్రతినిధులు వరదల్లో చిక్కుకున్న వారిని రక్షించే చర్యలపై అవగాహన కల్పించారు. ఎమర్జెన్సీ రెస్క్యూ బోట్ ద్వారా గడ్డెన్నవాగు ప్రాజెక్టు నీటిలో వరదల్లో చిక్కుకున్న వారిని రక్షించే చర్యలపై మాక్‌డ్రిల్ ద్వారా శిక్షణనిచ్చారు. ఇందులో టౌన్ సీఐ రాజారెడ్డి, ఎస్ఐ షరీఫ్‌తో పాటు పట్టణ పోలీసులు పాల్గొన్నారు.



రెస్క్యూ బోట్ ద్వారా వరదల్లో రక్షణ చర్యలపై అవగాహన కల్పిస్తున్న డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ప్రతినిధులు

## ప్రారంభమైన ఇథనాల్ పనులు

● ఎన్నికలు పూర్తయ్యే వరకు ఆపేసిన యాజమాన్యం ● అడ్డుకుంటామని చెప్పిన నాయకుల అడ్రస్ గల్లంతు ● ఆందోళనకు సిద్ధమవుతున్న ప్రజలు



ఇథనాల్ పరిశ్రమ నిర్మిస్తున్న ప్రదేశం ఇదే..



రోడ్డు కోసం ట్రాక్టర్‌తో మట్టిపోస్తున్న దృశ్యం

దిలావర్‌పూర్, జూలై 11 : ప్రజాగ్రహంతో ఆగిన ఇథనాల్ పరిశ్రమ పనులు తిరిగి ప్రారంభమయ్యాయి. దిలావర్‌పూర్ - గుండంపల్లి మధ్య పంట భూముల్లో ఇథనాల్ పరిశ్రమ నిర్మాణాన్ని మండలంలోని పలు గ్రామాల ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారు. ప్రజా అభిప్రాయాన్ని సేకరించకుండానే పరిశ్రమ నిర్మించడాన్ని తప్పుబట్టారు. పచ్చని పంట పొలాల్లో పరిశ్రమ నిర్మాణం వద్దని హెచ్చరించారు. అయినప్పటికీ యాజమాన్యం ముందుకే సాగడంతో దిలావర్‌పూర్, గుండంపల్లి గ్రామాల ప్రజలు ఆందోళన బాట పట్టారు. ధర్నాలు, రాస్తారోకోలు చేపట్టారు. 61వ జాతీయ రహదారిని దిగ్బంధించారు. వీరికి ప్రజాసంఘాలు పూర్తి మద్దతు పలికాయి. దీంతో ఆందోళన ఉధృతం కావడంతో యాజమాన్యం పోలీసుల సహాయం తీసుకుని పనులు మరింత వేగంగా చేసేందుకు ప్రయత్నించారు. దీంతో ఆగ్రహోదరులైన గుండంపల్లి, దిలావర్‌పూర్ గ్రామసులు పరిశ్రమ నిర్మిస్తున్న ప్రదేశాన్ని ముట్టడించారు. ప్రహరీగోడను కూలగొట్టారు. నిర్మాణ కంపెనీ ప్రతినిధికి చెందిన కారుకు గుర్తు తెలియని వారు కారు నిప్పంటించారు. కారు బూడిదయ్యింది. దీంతో పనులు నిలిపి వేశారు. పోలీసులు పలువురిపై కేసులు నమోదు చేశారు. ఇంతలోనే సాధారణ ఎన్నికల నోటిఫికేషన్ రావడం, ప్రచారం మొదలు కావడంతో ఇథనాల్ పరిశ్రమ నిర్మాణమే ప్రధాన అంశమయ్యింది. ఎన్నికల్లో గెలిపిస్తే ఇథనాల్ పరిశ్రమ నిర్మాణాన్ని అడ్డుకుంటామని అన్ని ప్రధానపార్టీల అభ్యర్థులు ప్రకటించారు. ఆ తర్వాత పార్లమెంట్ ఎన్నికలు రావడం అన్ని పార్టీల ఎంపీ అభ్యర్థులు సైతం ఇథనాల్ పరిశ్రమను అడ్డుకుంటామని హామీ ఇచ్చారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు యాజమాన్యం పనులను నిలిపివేసింది.

### ఎన్నికలు పూర్తి.. పనులు ప్రారంభం

సాధారణ, పార్లమెంట్ ఎన్నికలు అలా పూర్తయ్యాయో లేదో ఇలా ఇథనాల్ పరిశ్రమ పనులు మళ్లీ ప్రారంభమయ్యాయి. ముందుగా ఇథనాల్ పరిశ్రమ యాజమాన్యం ఇథనాల్ పరిశ్రమ వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ కరపత్రం ప్రచురించి జిల్లా అంతటా పంపిణీ చేసింది. ఎన్నికలు అయిపోయాయి. ఇథనాల్ పరిశ్రమ పనులు తిరిగి ప్రారంభిస్తామని కరపత్రాల ద్వారా చెప్పకనే చెప్పారు. దీంతో మండల ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఎక్కడ నలుగురు కలిసినా ఇథనాల్ ముచ్చటనే మాట్లా డుకుంటున్నారు. అనుకున్నట్లుగానే యాజమాన్యం పనులు వేగంగా చేపడు తున్నారు. ప్రజలు కూల్చిన ప్రహరీగోడకు తిరిగి మరమ్మతు పనులు చేస్తు న్నారు. భూమిని చదును చేస్తున్నారు. రోడ్డును బాగు చేస్తున్నారు. ఎట్టి పరి స్థితుల్లో పరిశ్రమ నిర్మాణం పూర్తి చేస్తామన్న పట్టుదలతో యాజమాన్యం ముందుకు సాగుతోంది.

### నాయకుల తీరుపై ప్రజల అసంతృప్తి..

ఎన్నికలకు ముందు పరిశ్రమ నిర్మాణాన్ని అడ్డుకుంటామని హామీ ఇచ్చిన నాయకులు ఎక్కడికి పోయారన్న అభిప్రాయం ప్రజల్లో వ్యక్తమవుతోంది. నలుగురు కలిసిన చోట నాయకుల తీరు పైనే చర్చించుకుంటున్నారు. వాట్సాప్ గ్రూపుల్లో నాయకుల తీరును ఎండగడుతున్నారు. తిరిగి ఆందోళనకు శ్రీకారం చుడదామన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. అవసరమైతే సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి సమస్యను వివరిద్దామని చర్చించుకుంటున్నారు. కాగా.. మరోవైపు ఆస్తుల ధ్వంసానికి పాల్పడితే కేసులు తప్పవని పోలీసులు హెచ్చరిస్తున్నారు.



పరిశ్రమకు వ్యతిరేకంగా జాతీయ రహదారిపై మహిళల రాస్తారోకో ( ఫైల్ )

## సంక్షిప్త సమాచారం

### రేపు పట్టణంలో విద్యుత్ సరఫరా నిలిపివేత

నిర్మల్ కల్చరల్, జూలై 11 : నిర్మల్ పట్టణం 220/132/33 కేవీ మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు. ఖానాపూర్, సారంగాపూర్, నిర్మల్‌స్టేషన్ల పరిధిలో ఈ అంతరాయం ఉంటుందన్నారు. ప్రత్యామ్నాయంగా బూరుగుపల్లి, పోచంపాడ్ 132 కేవీల ద్వారా విద్యుత్ సరఫరా చేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

### సీఏ కోర్సులో ఉత్తీర్ణుడైన సాంగ్వి గ్రామస్థుడు



నిర్మల్ కల్చరల్, జూలై 11 : దిలావర్‌పూర్ మండలం పాత సాంగ్వి గ్రామానికి చెందిన కొండ్రు ముత్యంరెడ్డి చార్టెడ్ అకౌంటెంట్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించాడు. మేలో నిర్వహించిన పరీక్షలో విజయం సాధించాడు.

### .. పరీక్షలో క్వాలిఫై అయిన రైతుబిడ్డ

లక్ష్మణచాంద, జూలై 11 : ఆల్ ఇండియా చార్టెడ్ అకౌంటెంట్ పరీక్షలో మండలంలోని వడ్యాల్ గ్రామానికి చెందిన రోషిణిరెడ్డి క్వాలిఫై అయ్యారు. 1,69,597 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా అందులో 20,446 పాస్ అయ్యారు. పాస్ అయిన వారిలో వడ్యాల్ గ్రామానికి చెందిన సామాన్య రైతు ఇప్ప భోజరెడ్డి, వీణారెడ్డిల కుమార్తె రోషిణిరెడ్డి ఉన్నారు. ఆమెను వారి తల్లిదండ్రులతో పాటు పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### 15న విద్యార్థులకు పోటీలు

నిర్మల్ కల్చరల్, జూలై 11 : ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ఈ నెల 15న సోఫీనగర్ కేజీబీవీ నిర్మల్ పాఠశాలలో విద్యార్థులకు పోస్టర్ మేకింగ్‌పై పోటీలు నిర్వహించనున్నట్లు డీఈవో రవీందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 9, 10 చదివే అన్ని ప్రభుత్వ పాఠశాలల నుంచి ఇద్దరు విద్యార్థులు పాల్గొనాలని సూచించారు. విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.

### వధకు సిద్ధంగా ఉన్న ఆవులు గోశాలకు తరలింపు

నిర్మల్ కల్చరల్, జూలై 11 : నిర్మల్ పట్టణ శివారులోని ఇబ్రహీం చెరువు వద్ద గోవధకు సిద్ధంగా ఉన్న 100 గోవులను గురువారం బీజేపీ నాయకులు పట్టుకున్నారు. పోలీసుల సహకారంతో వాటిని గోశాలకు తరలించినట్లు నాయకులు తెలిపారు. గోవధ శాలకు తరలించి, చెరువును పరిరక్షించాలని నాయకులు కోరారు. జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్ రెడ్డితో పాటు పలువురు నాయకులు గోవులను పట్టుకున్న వారిలో ఉన్నారు.

### పెన్షనర్లకు నేడు ఉచిత కంటి పరీక్షలు

నిర్మల్ కల్చరల్, జూలై 11 : జిల్లాలోని పెన్షనర్లు వారి కుటుంబ సభ్యులకు శుక్రవారం ఉదయం 10 గంటల నుండి సంఘ భవనంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు అధ్యక్షుడు లింగన్న తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.